క్లుప్తంగా

ఎస్‌ఐలుగా ఎంపిక


గరిడేపల్లి వేణు

నడిగూడెం : రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ప్రకటించిన ఎస్‌ఐ ఫలితాలలో నడిగూడెం మండలం నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. నడిగూడెం మండల కేంద్రానికి చెందిన బోళ్ల సందీప్, రామాపురం గ్రామానికి చెందిన గరిడేపల్లి వేణు, బృందావనపురం గ్రామానికి కొండా వంశీ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని ఆయా గ్రామాల పెద్దలు, మిత్రులు అభినందించారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన బాలాజీనాయక్


కిషన్‌రెడ్డితో మాట్లాడుతున్న బాలాజీనాయక్

మఠంపల్లి: మండలంలోని గుర్రంబోడుతండాకు చెందిన హైకోర్టు న్యాయవాది, సూర్యాపేట జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి ఇస్లావత్ బాలాజీనాయక్ ఆదివారం హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాలాజీనాయక్ స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. గుర్రంబోడుతండాలో గిరిజన భూముల ఆక్రమణపై బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన రైతు భరోసాయాత్ర తర్వాత రైతులపై నమోదైన అక్రమ కేసులు, పోడు భూముల పట్టాలు తదితర విషయాలపై కేంద్ర మంత్రితో మాట్లాడినట్లు పేర్కొన్నారు. కాగా గుర్రంబోడు రైతుల సమస్యలు, పోడుభూముల సమస్యలపై పూర్తి వివరాలతో నివేదిక అందజేయాల్సిందిగా కేంద్ర మంత్రి కోరారన్నారు. ఆయన వెంట పలువురు బీజేపీ నాయకులున్నారు.

తండ్రీకుమారుడికి స్వర్ణ కంకణ, నటసామ్రాట్ అవార్డులు


అవార్డులు అందుకున్న రామస్వామి, కిరణ్

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డకు చెందిన రంగస్థల కళాకారుడు యరగాని రామస్వామిగౌడ్, అతడి కుమారుడు యరగాని కిరణ్‌గౌడ్ ఆదివారం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో ఆలయ పరిరక్షణజ్యోతి, సర్ సీవీ రామన్ అకాడమీ సేవా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో స్వర్ణ కంకణ, నటసామ్రాట్ అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు విజయ్‌కుమార్, జడ్జి మధుసూదన్, మాజీ మంత్రి శంకర్‌రావు, వైద్య విద్వాన్ డాక్టర్ మధు తదితరులున్నారు.

గడ్డివాములు దగ్ధం

చిలుకూరు : మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామంలో షేక్ సుభాని, షేక్ నభిసాబ్, దొంతగాని సైదులుకు చెందిన గడ్డివాములకు ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో దగ్ధమయ్యాయి. దీంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను ఆర్పారు. ఈ విషయంపై బాధిత రైతులు చిలుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా గడ్డివాములు దగ్ధమవ్వడంతో లక్ష రూపాయలు నష్టపోయామని వారు తెలిపారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం


నేరేడుచర్లలోని ఎస్‌ఆర్‌కే అపార్ట్‌మెంట్‌లో కేక్ కట్ చేస్తున్న మహిళలు

నేరేడుచర్ల : పట్టణంలోని ఎస్‌ఆర్‌కే అపార్ట్‌మెంట్‌లో అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం మహిళలు, చిన్నారులు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

ఓపెన్ సొసైటీ ఆధ్వర్యంలో..

హుజూర్‌నగర్ : పట్టణంలో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఓపెన్ ఐస్ సొసైటీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో లక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని ఆదివారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యఅగ్నిహోత్రి, పంచామృతాభిషేకం చేశారు. అదేవిధంగా శ్రీలక్ష్మీనృసింహస్వామి, రాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు చేశారు. ప్రధాన ఆలయంలోని ముఖమండపంలో నూతన పట్టువస్త్రాలతో స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. కల్యాణ వేడుకలో భాగంగా విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగళ్యధారణ నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను గరుఢ వాహనంపై ఆలయ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళి

కోదాడ : తెలంగాణ రాష్ట్రం కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి దివంగత జయశంకర్‌సార్ అని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. ఆదివారం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చందు నాగేశ్వరరావు, షేక్ రహీం, మేదర లలిత, డాక్టర్ బ్రహ్మం, పోటు రంగారావు, రాధాకృష్ణ, ఉపేందర్, ముస్తఫా, వెంకట్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్

కోదాడరూరల్ : తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి అన్నారు. ఆదివారం కోదాడ ఎంపీడీఓ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీడీఓ శ్రీవిజయ, కార్యదర్శులు ఉన్నారు.

కోదాడఅర్బన్ : కోదాడలో కేఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో జయశంకర్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అధ్యాపక బృందం పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు అధ్యాపకుడు వేముల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, గురవయ్య, వాసు, యాదగిరి, ప్రభాకర్ రెడ్డి, బలభీమరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో..

సమైక్య రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి ఎలుగెత్తిన మహనీయుడు ఆచార్య జయశంకర్‌సార్ అని కోదాడ ఎంపీడీఓ విజయశ్రీ అన్నారు. ఆదివారం కోదాడ నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో ఆమె పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం నాయకులు అనంతరావు బ్రహ్మం, విద్యాచారి, వెంకటాచారి, అనంతారపు కృష్ణయ్య, రవీంద్రనాథ్, ఠాగూర్, శ్రీనివాసాచారి, వెంకటాచారి, ఓంకార్ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు.. ప్రొఫెసర్ జయశంకర్

చిలుకూరు : మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం తెలంగాణ ఉద్యమ నిర్మాత ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీషానాగేంద్రబాబు మాట్లాడుతూ జయశంకర్ ఆదర్శప్రాయుడని కొనియాడారు. ఎంపీడీఓ ఈదయ్య, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో ఆదివారం తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను టీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులతో కేక్ కట్ చేయించారు. టీఆర్‌ఎస్వీ కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు పాషా మండల అధ్యక్షుడు బెల్లంకొండ ఉపేందర్, కోదాడ పట్టణ అధ్యక్షుడు వంశీ నాని, నాయకులు క్రాంతికుమార్, తరుణ్‌రెడ్డి, మహిమూద్, నరేష్, అఖిల్, ఆసిఫ్, రియాజ్ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చన రవి, కౌన్సిలర్ కేఎల్‌ఎన్ రావు, కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నడిగూడెం : మండల పరిషత్ కార్యాలయంలో దివంగత ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ యాతాకుల జ్యోతి, ఎంపీడీఓ యం.యర్రయ్య, ఎంపీఓ యర్ర.లింగారెడ్డి, ఏపీఓ నగేష్, సర్పంచ్ గడ్డం నాగలక్ష్మి, మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ ఇమామ్, తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయకుమారి జయశంకర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీఓ శేఖర్, మున్సిపల్ సిబ్బంది, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపలసింగారంలో సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ముడెం గోపిరెడ్డి, జేఏ ముస్తఫా, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


కోదాడలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


హుజూర్‌నగర్ : చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి తదితరులు


నేరేడుచర్ల : జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ జయబాబు


కోదాడరూరల్ : ఎంపీడీఓ కార్యాలయంలో..


కోదాడఅర్బన్ : కేఆర్‌ఆర్ జూనియర్ కళాశాలలో..


హుజూర్‌నగర్‌రూరల్ : వేపలసింగారంలో..


చిలుకూరులో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీడీఓ, సిబ్బంది


మునగాల : ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో నివాళులర్పిస్తున్న టీఆర్‌ఎస్వీ నాయకులు


నడిగూడెంలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ జ్యోతి, తదితరులు

వాతావరణ మార్పులపై అవగాహన ఉండాలి

గరిడేపల్లి: వ్యవసాయంలో డ్రోన్ల వాడకం, వాతావరణ మార్పులపై దేశీ కోర్స్ డీలర్లు(ఫర్టిలైజర్ డీలర్లు) అవగాహన కలిగి ఉండాలని గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) సీనియర్ శాస్త్రవేత్త బి. లవకుమార్ అన్నారు. ఆదివారం కేవీకేలో వాతావరణ మార్పులపై దేశీ కోర్స్ డీలర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయంలో డ్రోన్ల వాడకం ద్వారా తక్కువ సమయంలో తక్కువ మందుతో ఎక్కువ విస్తీర్ణంలో సులభంగా రసాయన మందులు పిచికారీ చేసుకోవచ్చన్నారు. డ్రోన్ల ద్వారా ఎరువులు చల్లుకోవడం, విత్తనాలు, విత్తుకోవడం, తెగుళ్లను గుర్తించడం తదితర అంశాల గురించి తెలుసుకోవచ్చన్నారు. అదేవిధంగా డ్రోన్ల వాడకంలో తీసుకోవాల్సిన మెలకువలు, డ్రోన్ల రకాలు, వివిధ సైజుల నాజిల్స్, ఎకరానికి వాడాల్సిన పురుగుల మందులు, నీటిలో కరిగే ఎరువుల మోతాదు, డ్రోన్ల వాడకం వలన లాభాల గురించి వివరించారు. అనంతరం వాతావరణ మార్పులతో కలిగే దుష్పరిణామాలు, వాటి నుంచి విముక్తి పొందేందుకు అనుసరించాల్సిన పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో దేశీ కోర్స్ ఫెసిలిటేటర్ రిటైర్డ్ ఏడీఏపీ శంకర్‌రావు, ఉపకరణాల డీలర్లు సుందరి లక్ష్మీనారాయణ, సందీప్‌రెడ్డి, కృష్ణ, సురేందర్, వెంకటరమణ, మహేందర్‌రెడ్డి, మమత, అషియా బేగం, 40 మంది దేశీ కోర్స్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

చంద్రారెడ్డికి నివాళి

కోదాడరూరల్ : మండల పరిధిలోని అడ్లూరుకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జెట్టి చంద్రారెడ్డి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో మాజీ సర్పంచ్ జెట్టి లచ్చిరెడ్డి, పి.వీరారెడ్డి, బొబ్బా కోటిరెడ్డి, నాగేశ్వరగౌడ్ తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

హుజూర్‌నగర్ : పట్టణంలోని 14వ వార్డులో ఇటీవల అనారోగ్యానికి గురైన కోలపూడి సుధాకర్, ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సురభి సతీష్ కుటుంబాలను ఆదివారం మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించి చెరో రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.వసంత్‌కుమార్, కె.చంటి, ఎన్.చంటి, ఐ.రామకృష్ణ, ఎ.నరేష్, సత్యనారాయణ, కె.దయాకర్, డి.బాబురావు, హరీష్, ఇశాక్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ తొక్కుకుంటూ హైవేపైకి బాలుడు

- ఆడుకుంటూ వచ్చి ఇంటిని మరిచిన చిన్నారి
- గమనించి తల్లికి అప్పగించిన పోలీసులు

కోదాడరూరల్ : సైకిల్‌పై ఆడుకుంటూ ఇంటి నుంచి రోడ్డుపైకి వచ్చి ఇంటి అడ్రస్ మరిచిపోయిన బాలుడిని పోలీసులు క్షేమంగా తల్లికి అప్పగించారు. వివరాలు.. పట్టణంలోని లాల్ బంగ్లా సమీపంలో నివాసముండే మూడున్నర ఏళ్ల బాలుడు సైకిల్‌పై ఆడుకుంటూ రంగా థియేటర్ సమీపంలో సూర్యాపేట – కోదాడ ప్రధాన రహదారిపైకి వచ్చాడు. దీంతో వేగంగా వస్తున్న వాహనాలు ఆ బాలుడిని తప్పించుకొని వెళ్లాయి. నడిరోడ్డుపై వాహనాల మధ్యలో వెళ్తున్న బాలుడిని అక్కడే విధులు నిర్వహిస్తున్న బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్స్ అమర్‌నాథ్‌రెడ్డి, శ్రీనివాస్ గమనించి రోడ్డు పక్కకు తీసుకెళ్లారు. బాలుడిని వారు పేరు వివరాలు అడిగితే చెప్పలేకపోయాడు. దీంతో మీ ఇల్లు ఎటు వైపు అని అడగగా మళ్లీ సైకిల్ తొక్కుకుంటూ వెళ్తుండగా పోలీసులు వెనుక నుంచి వెళ్లి చిన్నారిని వెతుకుతున్న తల్లికి బాలుడిని అప్పగించారు. దీంతో పోలీసులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.


బాలుడిని తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

రైతు రుణాల వడ్డీ మాఫీ చేయాలి

గరిడేపల్లి : రూ.లక్ష రుణ మాఫీతో పాటు వడ్డీ కూడా మాఫీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రుణమాఫీ ఎన్నికల డ్రామా అని విమర్శించారు. రుణమాఫీ చేస్తే సరిపోదని, లక్ష రూపాయలకు పైగా పెరిగిన వడ్డీని చెల్లించాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు త్రిపురం సుధాకర్‌రెడ్డి, కడియాల అప్పయ్య, అంజిరెడ్డి, వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, ఆంజనేయులు, తాళ్ల తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన యువకుడిపై కేసు

మఠంపల్లి: హెడ్ కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించిన యువకుడిపై ఆదివారం మఠంపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ సీహెచ్ బాలకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మఠంపల్లిలోని మద్యం వైన్స్ వద్ద నాగరాజు మద్యం సేవించాడు. అనంతరం నాగరాజు మద్యం మత్తులో రహదారిపై వెళుతున్న కారుపై రాళ్లతో దాడిచేసి అద్దాలు పగులగొట్టాడు. భయపడిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.ఈ క్రమంలో హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ పోలీసులతో అక్కడకు చేరుకుని నాగరాజును అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయడంతో ఎదురుతిరిగి ఏకంగా అతడి గల్లాపట్టాడు. దీంతో పోలీసులు సదరు యువకుడిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్ తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


హెడ్‌కానిస్టేబుల్ గల్లా పట్టి గుంజుతున్న నాగరాజు

సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రామాపురం గ్రామ సర్పంచ్ గుజ్జ అనసూర్యమ్మ కోరారు. ఆదివారం కోదాడకు చెందిన ఆదిత్య హాస్పిటల్ ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. 100 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్. నాగమణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి


రాము (ఫైల్)

గరిడేపల్లి : ట్రాక్టర్ ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడు. గరిడేపల్లి మండలం కీతవారిగూడెంలో ఆదివారం జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గరిడేపల్లి మండల కేంద్రానికి చెందిన కారుకోళ్ల రాము (29) తండ్రి కారుకోళ్ల వెంకటేశ్వర్లు మఠంపల్లి మండలం చౌటపల్లి సబ్‌స్టేషన్‌లో లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. తండ్రి అనారోగ్యం దృష్ట్యా రాము నాలుగేళ్లుగా సబ్‌స్టేషన్‌లో పని చేస్తున్నాడు. సాయంత్రం పని ముగించుకొని స్వగ్రామానికి వస్తుండగా ట్రాక్టర్ ఢీకొట్టింది. సమాచారం తెలిసిన వెంటనే ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని అతడిని పెట్రోలింగ్ వాహనంలో హుజూర్‌నగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


ఏప్రిల్ 12న అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు మఠంపల్లి మండలం బక్కమంతులగూడేనికి వచ్చిన గద్దర్ (ఫైల్)

పోడుభూముల సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలో పోడు భూములు, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి కోరారు. ఆదివారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ జిల్లాలోకెల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలోనే గిరిజన జనాభా ఎక్కువగా ఉందని చెప్పారు. పోడు భూముల కోసం 7,373 దరఖాస్తులు పెడితే దానిలో వివిధ కారణాలతో 84 మాత్రమే అమోదించారని, మిగతావి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. జూన్‌లో కావాల్సిన వరినాట్లు ఇంకా కాలేదని, సాగర్ నుంచి సాగునీరు అందించాలని కోరారు. హుజూర్‌నగర్ నుంచి మట్టపల్లి బ్రిడ్జి వరకు రోడ్డును 4 వరుసల రహదారిగా విస్తరించాలని కోరారు. దీనికి ఆర్‌అండ్‌బీ మంత్రి సమాధానమిస్తూ పరిశీలిస్తామని చెప్పారు.

నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటు

నియోజకవర్గంలో ఐదు నూతన గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే సైదిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గరిడేపల్లి మండలం కొండాయిగూడెం, నేరేడుచర్ల మండలం జానల్‌దిన్నె, లాల్‌లక్ష్మీపురం, మేళ్లచెరువు మండలం దుబ్బతండా, జగ్గుతండాలను నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్ మృతి తీరని లోటు

- తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ గౌరిశంకర్


చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద దీర్ఘ కవితల పుస్తకాలు ఆవిష్కరిస్తున్న జూలూరి గౌరీశంకర్

మునగాల : ప్రజా గాయకుడు గద్దర్ మృతి తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరిశంకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో గద్దర్ చేసిన కృషి మరువలేనిదని, రచయితగా, గాయకుడిగా, ఉద్యమకారుడిగా గద్దర్ ఎంతో మందిని చైతన్యవంతులను చేశాడని కొనియాడారు. గద్దర్ మృతి తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు ఉప్పల యుగంధర్‌రెడ్డి, కందిబండ సత్యనారాయణ, ఉడుం కృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి చిల్లంచర్ల ప్రభాకర్ పాల్గొన్నారు.

దీర్ఘ కవితల పుస్తకాల ఆవిష్కరణ

కోదాడఅర్బన్ : కోదాడలో దామెర రాములు రచించిన 'నేను సావిత్రిబాయి పూలేను మాట్లాడుతున్నాను' వనపట్ల సుబ్బయ్య రచించిన 'బహుజన బావుటా దీర్ఘ కవితలు' అనే పుస్తకాలను ఆదివారం సాయంత్రం కోదాడ పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద దీర్ఘ కవితలను కవులు ఏ వృత్తుల వారి కోసం రాశారో ఆయా వృత్తుల వారితో కలిసి తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రచురించిన ఈ రెండు పుస్తకాలకు సంబంధించి గౌరీ శంకర్ మాట్లాడుతూ అంటరానితనం, కుల నిర్మూలనతో పాటు మహిళా వికాసానికి అవిశ్రాంతం పోరాటం చేసిన మార్గదర్శి జ్యోతిరావు పూలే అని, మహిళలకు చదువుల జ్యోతిని వెలిగించిన సావిత్రిబాయి పూలే మనకు ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో వేముల వెంకటేశ్వర్లు, పుప్పాల కృష్ణమూర్తి, సట్టు నాగేశ్వరరావు, మాధవరావు, సత్యం, బుడుగల సైదులు, బొల్లు రాంబాబు, స్వామి, జార్జి తదితరులు పాల్గొన్నారు.

ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలి

చిలుకూరు : ధరణి పోర్టల్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే ఆ పోర్టల్‌ను రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు అంజియాదవ్ అన్నారు. ఆదివారం చిలుకూరు మండలంలోని బేతవోలు, జెర్రిపోతులగూడెం, చెన్నారిగూడెం, ఆచార్యులగూడెం గ్రామాల్లో 'మన ఊరు– మన గడపకు మన అంజన్న' కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పదేళ్ల పాలనలో సీఎం కేసీఆర్ ఎలాంటి అభివృద్ధి చేయకుండా తిరిగి మరోసారి అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తున్నాడని, ప్రజలు ఎన్నికల్లో ఓడించి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్ నాయుడు, దేశినేని మట్టయ్యయాదవ్, రవి, కోటయ్య, రాముడు, శివ, తోట కమలాకర్, వెంకటేష్, బాబు, నవీన్, వెంకన్న, చంద్రకళ, గౌతమి, బాలు, అయ్యప్ప, అప్పారావు, సైదులు, రాజ, సాయి, సంతోష్, గోపి, చిన్నా పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

కోదాడఅర్బన్: ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.5వేల కోట్లు మంజూరు చేయాలని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(ఆవోపా) రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం నాయకుడు, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధన కోసం ఆదివారం కోదాడలో నిర్వహించిన సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో 13శాతం ఉన్న ఆర్యవైశ్యులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం లేదన్నారు. ఆర్యవైశ్యుల్లో అనేక మంది పేదవాళ్లు ఉన్నారని, వారిని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసేందుకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆవోపా కోదాడ అధ్యక్షుడు ఇమ్మడి రమేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని నాగుబండి రామ్మూర్తి నగర్ నుంచి వందలాది మంది ఆర్యవైశ్యులు భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక గుడుగుంట్ల అప్పయ్య ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆవోపా రాష్ట్ర, జిల్లా, మండల, పట్టణ నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను తీర్చిదిద్దాలి


కోదాడలో సమావేశమైన కబడ్డీ మాజీ క్రీడాకారులు


మాట్లాడుతున్న రామచందర్‌గౌడ్

కోదాడఅర్బన్ : కబడ్డీ అసోసియేషన్ బలోపేతానికి పాటుపడాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు బెల్లంకొండ రామచందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం కోదాడలోని ఎంఎస్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ గల క్రీడాకారులను వెలికి తీసి జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహించి ప్రోత్సహిస్తామన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, మాజీ క్రీడాకారులు పాల్గొన్నారు.

మాజీ కబడ్డీ క్రీడాకారుల సమావేశం

కోదాడఅర్బన్ : స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కోదాడకు చెందిన మాజీ కబడ్డీ క్రీడాకారులు పట్టణంలోని ఎంఎస్ ఆడిటోరియంలో గెట్ టూ గెదర్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కబడ్డీ క్రీడల్లో పురోగతి సాధించి కానిస్టేబుల్, ఎస్సైలుగా, సీఐలు, డీఎస్పీలుగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారందరూ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ప్రజా యుద్ధ నౌక గద్దర్ మృతికి సంతాపం

కోదాడఅర్బన్ : ప్రజా యుద్ధ నౌక గద్దర్ మృతికి కోదాడ లాల్ బంగ్లాలో జిల్లా అరుణోదయ సాంస్కృతిక మండలి సభ్యులు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆ మండలి జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి మాట్లాడుతూ గద్దర్ తన జీవితాన్ని ప్రజా ఉద్యమాలకు అంకితం చేసిన గొప్ప కవి, కళాకారుడని అని, తన ఆట, పాటలతో అనేక మందిని ప్రభావితం చేసిన విప్లవోద్యమ గొంతుక అని అన్నారు. ఆయన మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని అన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కోదాడరూరల్ : ప్రజా యుద్ధ నౌక గద్దర్ మృతి పట్ల మండల పరిధిలోని రామలక్ష్మీపురంలో శ్రీధర్‌రెడ్డి యువసేన సభ్యులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతి తెలంగాణ ప్రజలకు తీరని లోటని వారు అన్నారు. కార్యక్రమంలో యువసేన నాయకులు వీరనాగిరెడ్డి, చక్రపాణి, మణికంఠ, సురేష్, అశోక్‌రెడ్డి, వెంకట్ ఉన్నారు.

గద్దర్ మృతి ప్రజాఉద్యమాలకు తీరని లోటు

మోతె : ప్రజా యుద్ధ నౌక గద్దర్ అకాల మృతి యావత్ సమాజానికి తీరని లోటని మోతె సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మట్టిపెల్లి సైదులు అన్నారు. గద్దరు మృతికి ఆయన ఆదివారం సంతాపం తెలిపి మాట్లాడారు. గద్దర్ తన ఆటా పాటలతో ప్రజలను చైతన్యం చేశాడని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాంపాటి వెంకన్న, కందిబండ గోపి, స్టాలిన్, శివకృష్ణ, యల్లయ్య, నెహ్రూ, బత్తిని వెంకన్న తదితరులు ఉన్నారు.

ప్రజానాట్య మండలిలో ఓనమాలు దిద్దిన గద్దర్

నేరేడుచర్ల : సీపీఐ అనుబంధ ప్రజా నాట్యమండలిలో ఆటా– పాటలతో ప్రజా గాయకుడు, యుద్ధ నౌక గద్దర్ ఓనమాలు దిద్దారని ప్రజా నాట్యమండలి ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షుడు దూళిపాల ధనుంజయనాయుడు అన్నారు. ఆదివారం అనారోగ్యంతో మృతి చెందిన గద్దర్ మృతికి సంతాపం ప్రకటించారు.